పోర్టల్‌లో నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు తమ నోడల్ ఉపాధ్యాయుల ద్వారా MyGov.in పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని టిఒఎఫ్ఇఐ జిల్లా నోడల్ అధికారి పూజారి గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలలో పొగాకు వాడకం లేని కార్యక్రమాలుగా పోస్టర్ ప్రదర్శనలు, వీధి నాటికలు, నినాదాల ప్రదర్శనలు, ర్యాలీలు కార్యక్రమాలను నిర్వహించి, వాటి వీడియోలు, ఫొటోలను వెబ్‌సైట్‌లో ఈనెల 31లోపు అప్‌లోడ్ చేయాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు అమలు కావాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు.

బ్లాక్ మార్కెట్‌కు యూరియా

- ప్రభుత్వ కేటాయింపుల మేరకు జిల్లాకు రాని యూరియా
- కొరత అంటూ వ్యాపారుల అసత్య ప్రచారం
- యూరియా దొరకడం లేదన్న ప్రచారంతో ఎగబడుతున్న రైతులు
- ఇదే అదనుగా వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్న వైనం
- కొన్నిచోట్ల పురుగు మందులు అంటగడుతున్న పరిస్థితి

ఖరీఫ్‌లో జిల్లా అవసరాలకు అధికారులు పంపిన యూరియా ప్రతిపాదనలకు ప్రభుత్వం కోత పెట్టింది. ప్రభుత్వం కేటాయించిన పరిమాణంలోనైనా పంపిందా అంటే అదీ లేదు. దీంతో యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం యూరియా సరఫరా చేయకపోవడంతో, ఇదే అదనుగా యూరియా దొరకడం లేదంటూ వ్యాపారులు అసత్య ప్రచారం మొదలుపెట్టారు. తమ వద్ద ఉన్న నిల్వలను బయటకు తీయకుండా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో పుష్కలంగా వర్షాలు పడుతుండడంతో, యూరియాకు విపరీతమైన డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. మరోవైపు రాబోయే రోజుల్లో యూరియా దొరకదేమోనన్న అనుమానంతో ముందస్తు అవసరాలకు రైతులు ఎగబడుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు సొమ్ము చేసుకునేందుకు ధరలను పెంచడంతో పాటు యూరియా కావాలంటే పురుగుమందులను అంటగడుతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

ఖరీఫ్ మొత్తానికి 42,225 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అందులో కోత పెట్టి జిల్లాకు 21,840 మెట్రిక్ టన్నులు పంపింది. ప్రభుత్వం సరఫరా చేసిన యూరియాలో ఇప్పటివరకు 16,900 మెట్రిక్ టన్నుల మాత్రమే వచ్చింది. జూలై కోటా కింద విడుదల కావాల్సిన 9,600 మెట్రిక్ టన్నుల యూరియాలో నాలుగు వేల టన్నులు మాత్రమే వచ్చాయి. ఆగస్టు నెలకు సంబంధించి ప్రభుత్వం 12 వేల మెట్రిక్ టన్నులను సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,500 మెట్రిక్ టన్నులు పంపింది. అందులో ప్రైవేట్ డీలర్లకు 50 శాతం, మిగిలిన సగం నిల్వలు పిఎసిఎస్‌లు, డిసిఎంఎస్‌లు, రైతుసేవా కేంద్రాలకు సరఫరా చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన యూరియా కోటా సకాలంలో విడుదల కాకపోవడంతో, కొన్ని మండలాల్లో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీనికితోడు వరుసగా మూడు, నాలుగు రోజులు సెలవులు రావడంతో లారీల్లో లోడ్ చేయడంలో జాప్యం చేసుకున్నట్లు తెలిసింది. ఈ కారణాలతో కొంతమంది వ్యాపారులు యూరియా కొరత ఉందంటూ ప్రచారం చేస్తున్నట్లు తెలుస్తోంది. అదీగాక రైతులు కావాల్సిన పరిమాణం కంటే అదనంగా వాడకం వల్లే యూరియాకు డిమాండ్ ఏర్పడిందని అధికారులు భావిస్తున్నారు.

ఒక్కసారిగా డిమాండ్

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో చాలా చోట్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో యూరియా, డిఎపి వంటి ఎరువులను వినియోగించలేకపోయారు. అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురవడంతో యూరియాకు అధిక డిమాండ్ ఏర్పడింది. అదీగాక కొన్నిచోట్ల పంట పొలాలు నీటి మునగడంతో నారు బతికించుకోవడానికి రైతులకు యూరియా అవసరం బాగా ఏర్పడింది. దీంతో వారు యూరియా కోసం ప్రైవేట్ దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు సాధారణ ధరపై రూ.300 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. బస్తా యూరియాను ప్రభుత్వం రూ.275కు అందిస్తుండగా, ప్రైవేట్ వ్యాపారులు రూ.500కు యూరియాని విక్రయిస్తున్నారు. అదేవిధంగా డిఎపి ప్రభుత్వం రూ.1350కి విక్రయిస్తుండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.1600 పైబడి అమ్ముతున్నారు.

యూరియా కావాలంటే పురుగు మందులు కొనాల్సిందే...

రైతులకు అవసరమైన యూరియా, డిఎపి ఎరువులు సొసైటీలు, డిసిఎంఎస్, రైతు సేవా కేంద్రాల్లో దొరక్కపోవడంతో చేసేదేమీ లేక ప్రైవేట్ వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా వారు అందినకాడికి దోచుకుంటున్నారు. దీంతోపాటు యూరియా కావాలంటే పురుగు మందులు కొనాల్సిందేనంటూ షరతులు పెడుతున్నారు. రూ.400 నుంచి రూ.500 విలువ గల పురుగుమందు డబ్బాలను వ్యాపారులు రైతులకు అంటగడుతున్నారు.

బస్తా యూరియా కూడా దొరకడం లేదు

ఎకరా 20 సెంట్ల విస్తీర్ణంలో వరి వేశాను. రెండు బస్తాల యూరియా, ఒక డిఎపి బస్తా కావాలి. ప్రభుత్వం ఒక్క బస్తా కూడా ఇవ్వలేదు. పాలకొండలో ఒక బస్తా యూరియా బయట దుకాణంలో కొన్నాను. యూరియా రావడం లేదని వ్యాపారులు చెప్తున్నారు. రూ.500 పెట్టి కొందామన్నా దొరకడం లేదు.

- ఎ.శ్రీనివాసరావు, వైపర్త, బూర్జ

పురుగుమందులు కొనాలంటున్నారు

నేను రెండెకరాల్లో వరి వేశాను. ప్రభుత్వం రెండు బస్తాలు యూరియా ఇచ్చినా చాల్లేదు. మరో రెండు బస్తాల కోసం కొల్లివలసలోని ఒక దుకాణానికి వెళ్లాను. యూరియా కావాలంటే పురుగుమందులు కొనాలని చెప్పడంతో వెనక్కి వచ్చేశాను.

- దంత శ్రీరాములు, అన్నంపేట, బూర్జ

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

జిల్లాలో ఎరువులు ముఖ్యంగా యూరియాకు డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నాం. జిల్లాలో యూరియా కొరతేమీ లేదు. రైతులు వినియోగించాల్సిన ఎరువుల కంటే అదనపు వాడకం వల్లే డిమాండ్ ఏర్పడింది. యూరియాను అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటాం.

- కె.త్రినాథస్వామి, వ్యవసాయశాఖ జెడి

ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో పడుకున్న వృద్ధురాలు

అవ్వని ఏడి'ఫించన్'

ప్రజాశక్తి - కవిటి

తన వికలాంగ పింఛన్‌ను తొలగించారని ఎంపిడిఒకు మొరపెట్టుకునేందుకు వచ్చిన ముదిమి వయసులో ఉన్న ఓ అవ్వ కవిటి ఎంపిడిఒ కార్యాలయం అరుగుపై పడుకుని ఉన్న దృశ్యం చూపరుల మనసును తొలిచేసింది. కపాసుకుద్ది గ్రామానికి చెందిన సూరి నానమ్మ (85)కు ఒక కన్ను కనిపించదు. ఆమెకు మొన్నటి వరకూ వికలాంగ పింఛను అందేది. వికలాంగ పింఛను తీసుకుంటున్న వారిలో అనర్హుల తొలగింపులో భాగంగా ఆమెకు పింఛను అనర్హత నోటీసు పంపించారు. దీంతో ఆ అవ్వ తన మనవరాలి సాయంతో ఎంపిడిఒ కార్యాలయానికి బుధవారం వచ్చింది. తనకి ఒక కన్ను పూర్తిగా కనిపించదని, అయినా వచ్చే నెల నుంచి వికలాంగ పింఛను రాదని చెప్పున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. మరోవైపు నోటీసులు అందుకున్న వికలాంగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వికలాంగ పింఛన్లు తీసుకుంటున్న అనర్హులపై చర్యలు తీసుకోవాలి గానీ, అర్హుల పింఛన్లు తొలగించడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నోటీసులు అందుకున్న వికలాంగులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారని, వీరికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతున్నారు.

సాగులో సాంకేతికత అవసరం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు ఆధునిక వ్యవసాయ, అనుబంధ శాఖల సాంకేతిక అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మండలంలోని వప్పంగిలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ నుంచి తయారైన నానో కాపర్, నానో యూరియా ప్లస్, నానో డిఎపి, నానో జింక్ వంటి ఇఫ్‌కో నానో ఎరువులతో పాటు సిఐఎల్ కంపెనీ నానో డిఎపి, ఐపిఎల్ కంపెనీ వారి నానో యూరియా నానో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్ స్ప్రేయర్లను రైతులకు పరిచయం చేశారు. ఇవన్నీ రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ ఎరువులు గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తూ పంట నాణ్యత, ఉత్పత్తిని పెంచుతాయన్నారు. సంప్రదాయ ఎరువుల కంటే తక్కువ ధర, నిల్వ, రవాణాలో సులభతరమన్నారు. నానో ఎరువుల స్ప్రే కోసం 6 ఇఫ్‌కో కిసాన్ డ్రోన్, 20 కిసాన్ డ్రోన్లు, 11 నమో దీదీ డ్రోన్లు అందుబాటులో ఉంటాయన్నారు. డ్రోన్ కోసం ఇఫ్‌కో ఫీల్డ్ ఆఫీసర్లు, మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు. నానో యూరియా ప్లస్, నానో డిఎపి స్ప్రేయింగ్‌పై రైతుల అవగాహన కోసం ఏర్పాటు చేసిన డ్రోన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాథస్వామి, మండల వ్యవసాయ అధికారి పి.నవీన్ కుమార్, సర్పంచ్ చల్ల వాణిదేవి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. వార్డు సచివాలయాల ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్ కార్యదర్శులు, కార్పొరేషన్ సిబ్బందితో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా శానిటేషన్‌పై మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా తాగునీటి పైపులు పాడైతే తాగునీరు కలుషితం కాకుండా కాలువలకు దగ్గరగా ఉన్న పైపులైను కొంచెం దూరంగా ఉండాలన్నారు. లేకుంటే తాగునీరు కలుషితమై డయేరియా, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. శానిటేషన్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్లానింగ్, శానిటేషన్, ఇంజనీరింగ్ ముగ్గురు సమన్వయంతో కార్పొరేషన్‌లో డోర్ టు డోర్ చెత్త కలెక్షన్, రోడ్లు క్లీనింగ్, రోడ్డు పక్కన మట్టి పేరుకుపోతే దాన్ని తొలగించడం వంటి వాటిని చూడాలన్నారు. తాను వార్డుల్లో పర్యటిస్తానన్నారు. అక్టోబర్ రెండో తేదీన ఒక సచివాలయం అన్ని విధాలుగా శుభ్రత, తదితరమైన వాటిలో బాగుంటే ఉత్తమ వార్డు సచివాలయ అవార్డు ఉంటుందని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.విడి ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది, వార్డు సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అభివృద్ధి ధ్యేయంగా పాలన

పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - పలాస

అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కాశీబుగ్గ రైల్వే వంతెన నిర్వాసితులకు బుధవారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకులు తాము పనులు చేస్తే కూటమి నాయకులు హంగామా చేస్తున్నారని విమర్శిస్తున్నారని, వారు అరకొర పనులు చేయించి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం వాటిని చెల్లించడంతో పాటు కేంద్రం నుంచి తీసుకువచ్చి పనులు పూర్తి చేయిస్తున్నామని చెప్పారు. గతంలో తొమ్మిది మందికి నష్టపరిహారం, పట్టాలు కూడా ఇవ్వకుండా గత పాలకులు ఎంతో ఇబ్బందులకు గురిచేశారని, నేడు వారికి నష్టపరిహారంతో పాటు ఇళ్ల పట్టాలను అందించామన్నారు. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను గుర్తించే బాధ్యతను అధికారులకు అప్పగించి నిజమైన లబ్ధిదారులకు నష్టపరిహారం, ఇళ్ల స్థలాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, ఎల్.కామేశ్వరరావు, జి.సూర్యనారాయణ, జి.కృష్ణారావు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

అందువల్లే 'ఆకాంక్ష జిల్లా' కాలేదు

- వ్యవసాయ ఉత్పాదకతపరంగా ప్రమాణాలు తక్కువ
- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

దేశవ్యాప్తంగా వెనుకబడిన జిల్లాల్లో జీవన ప్రమాణాలను పెంచేందుకు నీతి అయోగ్ రూపొందించిన ఆకాంక్ష జిల్లాల (ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్) జాబితాలో ఒకే ఒక్క ప్రమాణం చాలక శ్రీకాకుళం జిల్లాకు కేంద్ర ప్రభుత్వం చోటు కల్పించలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్ అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆకాంక్ష జిల్లాల కార్యక్రమం కింద జిల్లాలో వ్యవసాయ ఉత్పాదకత తగినంత లేకపోవడం వల్ల జాబితాలో చోటు దక్కలేదన్నారు. రైతులు ఇంకా రెండో పంట కోసం ఎదురుచూడడం బాధాకరమన్నారు. రైతులు ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేయడంలో వెనుకబడి దిగుమతులను పెంచుకోలేకపోతున్నారని చెప్పారు. ఒడిశాలో బిజెపి, ఎపిలో కూటమి ప్రభుత్వాలు ఉన్నా, నేరడి బ్యారేజీ ప్రాజెక్టు ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉందన్నారు. 'ప్రసాదం' పథకం ద్వారా అరసవల్లి, శాలిహుండం తదితర వాటికి నిధులు కేటాయించడంతో పాటు మహేంద్రగిరుల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ పేరుతో నిధులు కేటాయించనుందని తెలిపారు. మూలపేట పోర్టు, మరో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తోందని చెప్పారు. సంచార, అర్ధ సంచార జాతులకు మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాలు డీ నోటిఫైడ్ ట్రైబల్స్ పేరుతో సర్టిఫికేట్లు అందించి గుర్తించాయన్నారు. త్వరలోనే రాష్ట్రంలోనూ సర్టిఫికేట్లు అందజేస్తామని చెప్పారు. విజయవాడలో ఈనెల 31న సంచార జాతుల విముక్తి దినోత్సవాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. అందులో భాగంగా స్ఫూర్తి పేరుతో సదస్సు నిర్వహించనున్నామన్నారు. అంతకుముందు శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరంలో చాయ్ పే చర్చలో పాల్గొన్నారు. అక్కడ గాంధీ విగ్రహానికి, తర్వాత కోడి రామ్మూర్తి స్టేడియం వద్ద ఉన్న కోడి రామ్మూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. సమావేశంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, బిజెపి సీనియర్ నాయకులు పైడి వేణుగోపాలం, పూడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్న అవినీతిపై విచారణ చేయాలి

వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిలక్

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

వ్యవసాయ శాఖలో మంత్రి అచ్చెన్నాయుడు చేస్తున్న అవినీతిపై బహిరంగ దర్యాప్తు చేపట్టి, సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై అందజేసే వ్యవసాయ పనిముట్లలో అచ్చెన్నాయుడు తన ఒఎస్‌డి పోలినాయుడుతో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పనిముట్లు తయారు చేసే కంపెనీలతో మధ్యవర్తిత్వం వహించి డబ్బులు వసూలు చేయాలని ఆగ్రో జిఎంపై ఒత్తిడి తీసుకొచ్చారని, ఆ పని చేయలేనన్న జిఎంను నెల్లూరు బదిలీ చేశారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై దర్యాప్తు చేయించి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అచ్చెన్నాయుడు, ఆయన కుటుంబ సభ్యులు అవినీతిపై ధ్యాస తప్ప అభివృద్ధిలో గానీ రైతుల సమస్యల పరిష్కారంలో గానీ లేదన్నారు. కొంతమంది టిడిపి నాయకులు అవగాహనా రాహిత్యంతో అచ్చెన్నాయుడు అవినీతికి మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. రైతులకు యూరియా కొరత తీవ్రంగా ఉన్నా, యూరియా పంపిణీకి ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. నందిగాం మండలంలో నిర్మాణం పూర్తయిన విత్తనోత్పత్తి కేంద్రానికి మిగతా సదుపాయాలు కల్పించి, ప్రారంభించేందుకు వ్యవసాయ శాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా టిడిపి అధికారంలోకి వస్తే టెక్కలిని జిల్లా కేంద్రంగా చేస్తానని హామీనిచ్చిన అచ్చెన్నాయుడు, నేడు ఎందుకు ఆ ప్రతిపాదన చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. రైతులకు ఉచిత పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురునాథ్ యాదవ్, సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, టిడిపి మండల అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సంపతిరావు, హేమసుందర రాజు, తమిరి ఫల్గుణరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిలక్

సిసి ఫుటేజ్‌లు బయటపెట్టాలి

వైసిపి ఆమదాలవలస ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

పొందూరు కెజిబివి ప్రిన్సిపాల్ సౌమ్య వ్యవహారంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ కార్యాలయంలో జరిగిన సంఘటనల సిసి టివి ఫుటేజ్ బయటపెట్టాలని వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా ఉద్యోగులతో సాయంత్రం ఐదు గంటల తర్వాత సమీక్షా సమావేశాలు పెట్టాలని ఏ ప్రివిలేజ్ కమిటీ చెప్పిందో ఎమ్మెల్యే చెప్పాలన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ తనను శారీరకంగా, మానసికంగా వేధించారని ప్రిన్సిపాల్ ఆరోపణలపై తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాల్సింది పోయి వైసిపిపై లేనిపోని ప్రేలాపనలు సరికాదన్నారు. ఆయన నిబద్ధత గల నాయకుడైతే తనపై వచ్చిన ఆరోపణలపై జ్యుడీషియల్ విచారణను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరాలన్నారు. ప్రతిపక్ష పార్టీగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సౌమ్యను పరామర్శించి, ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలపై ప్రశ్నిస్తే ఎదురుదాడి చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మహిళలపై దాడులు, అఘాయిత్యాలు జరిగితే గన్ను కంటే ముందు వచ్చి శిక్షిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే తనపై చేసిన అసత్య ఆరోపణలపై క్రిమినల్ కేసు పెట్టి సివిల్ సూట్ వేస్తానన్నారు. ఎమ్మెల్యే తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, ఖండాపు గోవిందరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలోని డిఎల్‌టిసి ఐటిఐలో మిగులు సీట్ల భర్తీకి మూడో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎడి రామ్మోహనరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 29న కౌన్సిలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ఈనెల 26వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో iti.ap.gov.in దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

బాలికల కోసం ప్రత్యేకంగా సూయింగ్ టెక్నాలజీ (టైలరింగ్) కోర్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9505161701, 9963945259, 9885960809 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కెజిబివి హాస్టల్‌ను ప్రారంభించాలి

మాట్లాడుతున్న ప్రసాద్

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అనుబంధంగా ఉన్న కెజిబివి వసతి గృహం పూర్తిస్థాయిలో తెరిపించాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెజిబివి హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు హాస్టల్ ప్రారంభించి పౌష్టికాహారం అందించాలన్నారు. అడ్మిషన్లు పూర్తయి రెండు నెలలు. కావస్తున్నా నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు.

నిధుల మంజూరుకు వినతి

వినతిపత్రం అందజేస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం పాత జాతీయ రహదారి నుంచి బహుదా వంతెన నిర్మాణానికి, పికెటి రోడ్డు - జాడా రోడ్డు పనులు నిర్వహించేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కోరారు. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు బుధవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యే జలజీవన్ ఉద్దానం మంచినీటి పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సిబ్బందిని విధుల నుంచి తొలగించిన విషయం కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొన్నేళ్లుగా ఉద్దానం మంచినీటి పథకంలో పనిచేస్తున్న సదరు సిబ్బందికి ప్రస్తుతం కుటుంబం గడవడమే కష్టంగా మారిందని, వారి సమస్యలు దృష్టిలో పెట్టుకొని వారికి న్యాయం చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బాహుదా వంతెనతో పాటు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఉద్దానం మంచినీటి పథకంలో తొలగించిన సిబ్బందికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వంశధార, బాహుదా నదుల అనుసంధానంపై గతంలోనే ఓ ఆలోచన చేయడం జరిగిందని, దీనిపై ఒడిశా ప్రభుత్వంతో చర్చించి దానికో రూప కల్పన చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

జలహారతిలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష

సాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతి చేనుకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం సీతాపురం, బొడ్డపాడు, రామ చెరువు వద్ద నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంశధార శివారు ప్రాంత రైతులు సాగునీటి కోసం పడిన కష్టాలు అందరికీ తెలిసిందేనన్నారు. రైతుల కోసం తాను ముందుండి పోరాడతానన్నారు. ప్రభుత్వం రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకం అమలు చేసిందని, సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో వంశధార అధికారులు శేఖరరావు, తమ్మినేని రాజశేఖర్, టిడిపి నాయకులు పి విఠల్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు కణితి సురేష్ చౌదరి, దుంపల వల్లభరావు, ఉప్పాడ కృష్ణారావు, మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు, నీటి పంపిణీ అధ్యక్షుడు గొణప నిరంజన్, టిడిపి నాయకులు కోణారి కిరణ్ కుమార్, అంబటి రామకృష్ణ, ఉంగ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పరిషత్ యాజమాన్యంలో సర్వీస్‌లో ఉండగానే మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించే సాంఘిక భద్రతా పథకం కింద ఉద్యోగ నియామక పత్రాలను జడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ జిల్లా ప్రజా పరిషత్ బంగ్లాలో బుధవారం అందజేశారు. కొండగొర్రి రాహుల్‌కు భామిని మండల ప్రజా పరిషత్ కార్యాలయం, తీడ తేజేశ్వరరావుకు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం శ్రీకాకుళం, సూరవజ్జల రాజ్యలక్ష్మికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హరిపురం, వేమూరి నాగమణి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం శ్రీకాకుళంలో నియాక ఉత్తర్వులు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజా, ఉప ప్రధాన కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణ, సి సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ దాస్

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జాతీయ అంధత్వ నివారణ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బోరుభద్ర జెడ్‌పి హైస్కూల్‌లో నేత్ర పరీక్షలు నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డా. పి.అవని పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో ఆప్తాలమిక్ అధికారి ఎం.ఆర్.కె. దాస్ 206 మంది విద్యార్థులకు పరీక్షలు చేసి, దృష్టిలోపం ఉన్న 16 మందికి ఉచిత కళ్లద్దాల కోసం సిఫారసు చేశారు. ఈ సందర్భంగా డా.అవని మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఏడాది కంటి పరీక్షలు చేయించుకోవాలని, కళ్లద్దాలు సూచించిన వారు తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.రవికుమార్, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగ పింఛన్లు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- పోలాకి

ప్రభుత్వం రద్దు చేసిన వికలాంగుల పింఛన్లు తిరిగి పునరుద్ధరించాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ బి.ప్రకాష్‌కు వికలాంగులు దరఖాస్తులు సమర్పించారు. అధికారులు సర్వే జరిపి తమ పింఛన్లు రద్దు చేశారని, ఇప్పుడు మళ్లీ తనిఖీ జరిపించి అర్హులైన వికలాంగులకు పింఛన్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని వారు తెలిపారు. వారు దరఖాస్తుతో పాటు ప్రభుత్వం ఇచ్చిన వికలాంగ ధ్రువీకరణ పత్రాన్ని జత చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఎండిఒ మాట్లాడుతూ పారదర్శకంగా విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ సిబ్బంది

ప్రజాశక్తి- బూర్జ

దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కె. అనిత అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం, జాతీయ డీ-వార్మింగ్ మాప్ అప్ దినోత్సవం సందర్భంగా బుధవారం బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఊపి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ప్రజలకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ, డీ-వార్మింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ మేరీ కాథరిన్, జిల్లా మలేరియా అధికారి పి.వి. సత్యనారాయణ, పిహెచ్‌సి వైద్యాధికారి జి. రాజశేఖర్, జిల్లా సహాయ మలేరియా అధికారి ఎస్.శ్రీనివాసరావు, విబిడి కన్సల్టెంట్ ఎస్. శ్రీకాంత్, పిహెచ్‌సి సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: దోమలు ద్వారా సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అనిల్ మనోహర్ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బెల్లుపడా అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద అవగాహన కల్పించారు. అనంతరం సాముహిక ప్రతిజ్ఞ చేసి, బెల్లుపడా పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ రఘుబాబు, వైద్య సిబ్బంది రాఘవ, వెంకట,

బూర్జ : ర్యాలీలో పాల్గొన్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి అనిత

ఎఎన్‌ఎం.లక్ష్మీ, కెజిబివి ప్రిన్సిపాల్ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

పలాస: దోమల నివారణకు చర్యలు చేపట్టాలని రెంటికోట వైద్యాధికారి డాక్టర్ టి.సునీల్ కుమార్ అన్నారు. మండలం రెంటికోట పిహెచ్‌సి వద్ద ప్రపంచ దోమల దినోత్సవంపై ర్యాలీ చేపట్టారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఆదమ్మ, సూపర్‌వైజర్ బి.పద్మావతి, ఫార్మసీ ఆఫీసర్ బోనెల గోపాల్, ఎస్‌టిఎస్ సూపర్‌వైజర్ సేనాపతి కోటేశ్వరరావు, స్టాఫ్‌నర్స్ రాజేశ్వరి, మేరీ బాయ్, త్రివేణి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వన్వే జంక్షన్ వద్ద నున్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి భారతదేశ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి పునాది వేసిన రాజీవ్ గాంధీ విజనరీ నాయకుడని అన్నారు. ఆ కాలంలోనే టెక్నాలజీ అవసరాన్ని గుర్తించి ఐటి రంగాన్ని దేశానికి పరిచయం చేసిన వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, సనపల రాజులు, లఖినేని సాయిరాం, పప్పల అప్పారావు, పూజారి త్రినాధరావు, రమేష్, రమణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పిజి మెడికల్ ఎంట్రన్స్‌లో విద్యార్థిని ప్రతిభ

ప్రజ్ఞామణి

ప్రజాశక్తి- సోంపేట

బుధవారం విడుదలైన పీజీ మెడికల్ ఎంట్రన్స్ ఫలితాల్లో సోంపేట పట్టణానికి చెందిన గేదెల ప్రజ్ఞామణి ఆల్ ఇండియా లెవెల్‌లో 1039 ర్యాంకు సాధించింది. ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసింది. ఆమె తండ్రి సోమేశ్వరరావు ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా తల్లి గృహిణి. ప్రజ్ఞమని అత్యుత్తమ ర్యాంకు సాధించడంపై తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్దలు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

రెండు బార్‌ల కేటాయింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీశయన, సొండి సామాజక వర్గాలకు రెండు బార్లు కేటాయించినట్లు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి జిహెచ్ తిరుపతి నాయుడు ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం మున్సిపాల్ కార్పోరేషన్‌లో ఒకటి, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఒకటి కేటాయించినట్లు చెప్పారు. ఆర్ఇటి రూ.27.50 లక్షలుగా చెప్పారు. మూడేళ్లకు ఈ బార్ లైసెన్స్ ఉంటుందన్నారు. ఈ నెల 29వ తేదీ సాయంత్రంలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక స్వర్ణ భారతి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినికి డిగ్రీ సెకండ్ సెమిస్టర్ 2025 ఫలితాల్లో కంప్యూటర్ సైన్స్ హానర్స్ విభాగానికి చెందిన విద్యార్థిని అమీషా కుమారి సహాని 9.38 సిజిపిఎ పాయింట్లు సాధించి నియోజకవర్గంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుందని చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి అభినందించారు. ఈమె టెన్త్ 565, ఇంటర్మీడియట్లో 955 మార్కులు సాధించిందన్నారు. కార్యక్రమంలో ఎఒ చాట్ల రాము రెడ్డి, కో-ఆర్డినేటర్స్ మహేశ్వరి రెడ్డి, నీలిమ రెడ్డి, డిగ్రీ, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాళ్లు సందీప్, జయప్రకాష్, అధ్యాపక సిబ్బంది పాల్గొని విద్యార్థిని అభినందించారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు

ప్రజాశక్తి- టెక్కలి

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, హెచ్ఇసి, సిఇసి వంటి కోర్సుల్లో ప్రవేశానికి అర్హులని తెలిపారు. ఇంటర్మీడియట్ మధ్యలో ఆగిపోయిన వారు, వివిధ కారణాల రీత్యా చదువు మధ్యలో ఆపివేసిన వారు, ప్రత్యేక అవసరాలు గల వారు అర్హులన్నారు. సెప్టెంబర్ 15లోగా ధరఖాస్తులు కళాశాలలో అందించాలన్నారు. రూ.200 అపరాధ రుసుంతో చెల్లించుటకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల వారు కళాశాల పనిచేసే సమయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 1వ వార్డు మోగిలిపాడు గ్రామానికి చెందిన దున్న దుర్గమ్మ ఇటీవల మృతి చెందడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మృతురాలు కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు 1వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి దున్న సత్యం, వైసిపి పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, మాజీ ఎంపిపి బత్తిని హేమేశ్వరరావు, నల్ల బొడ్లూరు సర్పంచ్ ఉమాపతి, వైసిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబటి ఆనందరావు, వైసిపి పట్టణ ఉపాధ్యక్షుడు నర్తు వెంకటరమణ, ఢిల్లీ మాస్టర్, కృష్ణ తదితరులున్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- సోంపేట

మందస మండలం పట్టులోగాం గిరిజన ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఇటీవల జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయునుల డిప్యూటేషన్ రద్దు చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లండ బాబురావు డిమాండ్ చేశారు. మందసలో బుధవారం జరిగిన యుటిఎఫ్ జిల్లా ప్రాంతీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాలలోని

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఉపాధ్యాయుల మధ్య జరిగిన సంఘర్షణ విద్యార్థుల, పాఠశాల భవిష్యత్‌పై ప్రభావం చూపుతోందని అన్నారు. డిప్యూటేషన్‌పై పంపించిన ఉపాధ్యాయనిలను తిరిగి వారి పాత స్థానాలకు పంపించాలని, తద్వారా పాఠశాల విద్యా ప్రగతిని కాపాడగలమని వారు తెలియజేశారు. పాఠశాలపై సమగ్ర విచారణ జరపడం వలన మాత్రమే సమస్యకు పరిష్కారం అవుతుందని, అంతవరకు ఉపాధ్యాయినిలను వారి పాత స్థానాలకు పంపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు గున్న రమేష్, కంచరార రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, మందస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, పలాస అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.జై రామ్, ఎస్. వెంకట రమణ, జిల్లా అకడమిక్ సెల్ కో-కన్వీనర్ మాధవరావు, టి.అప్పారావు, జి.మధు, జి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎలక్ట్రికల్ వర్కర్లు, గృహనిర్మాణ శాఖ కార్మికుల సంక్షేమమే లక్ష్యమని న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ అన్నారు. నగరంలో స్థానిక ప్రవేట్ హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. భారతదేశంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు భవన నిర్మాణ బోర్డులు పలు రాష్ట్రాలు ఏర్పాటు చేశాయన్నారు. మన రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవన్ నిర్మాణ బోర్డును నిలుపుదల చేసిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానిని పునరుద్దించాలని డిమాండ్ చేశారు. ఎలక్ట్రికల్ కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పిఎఫ్ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణం ఈ డిమాండ్లను నెరవేర్చకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులను ఐక్యం చేసి, కార్మికుల హక్కులను సాధించుకుంటామన్నారు. కార్యక్రమంలో మహీ బుల్లాఖాన్, యూనియన్ నాయకులు తోట తారకనాథ్, బాలకృష్ణ, మామిడి క్రాంతి, జిల్లా అధ్యక్షులు సువ్వారి బాలకృష్ణ,, రామకృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న న్యాయవాది శ్రీమన్నారాయణ

మురపాక మండల ఏర్పాటుకు ఉద్యమించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ అప్పలరాజు

ప్రజాశక్తి- లావేరు

మురపాక మండలంగా ఏర్పాటు అయ్యేవరకు పార్టీలకు అతీతంగా ఉద్యమంలో ప్రతి ఒక్కరు పాల్గొని ఉద్యమించాలని మురపాక మండల సాధనసమితి పిలుపు నిచ్చింది. మురపాకలో ఎంఎంఎస్ సాధన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అల్లంశెట్టి అప్పలరాజు, మాజీ జెడ్‌పిటిసి రాజాపంతుల ప్రకాశరావు, బి. శ్రీనువాసులు నాయుడు తదితరులు మాట్లాడుతూ మురపాక మండలంగా ఏర్పాటు కావాలని పన్నెండు గ్రామ పంచాయతీల్లోని 35 గ్రామాల ప్రజలు 35 ఏళ్లగా ఆకాంక్షిస్తున్నారని, దానిని నెరవేర్చుకునే సమయం ఆసన్నమైందని, ప్రతిఒక్కరూ ఈ మహా ఉద్యమంలో పాల్గొనాలన్నారు. ఈనెల 28, 29 తేదీల్లో మంత్రివర్గ ఉప సంఘం జిల్లా పర్యటనలో ప్రజలు నుంచి అభిప్రాయాల సేకరణ, వినతుల సేకరణ కార్యక్రమం ఉందని, ఈ ఉద్యమంలో 30 గ్రామాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే 20 మందితో మురపాక మండల సాధన కమిటీని నిర్ణయించారు. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అన్ని పార్టీల నాయకులు, ప్రజలు, ఉద్యోగులు, వ్యాపారులు, మేధావులు, యువత పాల్గొన్నారు.

ఢిల్లీరావు మృతి ఉద్యమానికి తీరని లోటు

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- పలాస

సిపిఎం సీనియర్ నాయకులు బత్తిని ఢిల్లీరావు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అన్నారు. పలాస మండలం బొడ్డపాడులో ఢిల్లీరావు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ ఢిల్లీరావు తన జీవితాన్ని కార్మిక వర్గానికి అంకితం చేశారని కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ కార్యదర్శిగా పనిచేస్తూ కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారని గుర్తు చేశారు. గంగవరం పోర్టు ఉద్యమంలో 40 రోజుల పాటు జైల్లో ఉన్నారని, ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడిన ఒక గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ సంతాప సభలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులకు సంగారు లక్ష్మీనారాయణ సిఐటియు సీనియర్ నాయకులు జుత్తు సింహాచలం, సిఐటియు నాయకులు ఎన్.గణపతి, ప్రజా సంఘాల నాయకులు టి రాజు, తాతారావు, ఎం.జీవనరావు, బొడ్డు సింహాద్రి, పి.లక్ష్మణరావు, పి.గీతమ్మ, బి.పాపారావు తదితరులున్నారు.

సంతాపం తెలియజేస్తున్న వామపక్ష నాయకులు

ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల వితరణ

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ప్రత్యేక అవసరాలు గల పాఠశాల (భవిత) విద్యార్థులకు బుధవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు 10 చిన్నారుల స్టూళ్లను ఐఇఆర్‌టి రాధారాణి, రమణలకు వితరణగా అందజేశారు. వీటిని విశ్రాంత ఉద్యోగులు అంకం ధర్మారావు, అల్లంశెట్టి విజయ్‌కుమార్, పాలవలస దివాకర్ పాత్రోల ఆర్థికసాయంతో అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంతి ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు నాళం పైడిరాజు, పాలిశెట్టి సూర్య ప్రకాశరావు తదితరులు అభినందించారు.

స్టూల్స్‌ను అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మహిళలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు

పొందూరు : మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

మహిళలను తప్పుడు దృష్టితో చూసి మహిళల ఫోటోలను మార్ఫింగ్ చేసి ఆ ఫోటోలతో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ రాజకీయం చేయడం సిగ్గుచేటని టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్ అన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై చింతాడ రవికుమార్ చేసిన ఆరోపణలపై బుధవారం మండల కేంద్రంలో విలేఖరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన విజయానికి కారకులైన మహిళలను తిరుమల దర్శనానికి తీసుకు వెళ్ళిన రవికుమార్‌తో వ్యక్తిగతంగా మహిళలు తీసుకున్న పోటోలను మార్ఫింగ్ చేసి నీ అనుకూల మీడియాలో చూపిస్తే నియోజకవర్గ ప్రజలు నమ్మరన్నారు. పాదయాత్రలో మీ జగన్మోహన్ రెడ్డిని కలిసిన మహిళలపై చేతులు వేసి ముద్దలు పెట్టాడని అయితే ఆ మహిళలతో అక్రమ సంబంధాలు ఆయనకు ఉన్నాయా అని ప్రశ్నించారు. మహిళలను గౌరవించలేని నీకు మహిళలకు సముచిత స్థానం కల్పించే రవికుమార్‌ను విమర్శించే హక్కు అర్హత లేదని ఆగ్రహం వ్యక్త చేసారు. ప్రిన్సిపాల్ సౌమ్యపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారించి కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులు తీసుకున్న చర్యలకు ఎమ్మెల్యేను ఎలా బాధ్యులు చేస్తారన్నారు. సమావేశంలో మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు, తెలుగుయువత జిల్లా ప్రధానకార్యదర్శి బలగ శంకరభాస్కర్, పట్టణపార్టీ అధ్యక్షులు అనకాపల్లి చినరంగ, మాజీ పిఎసిఎస్ ఉపాధ్యక్షులు కె.అప్పలనాయుడు, టిడిపి నాయకులు శ్రీనివాసరావు, బాల తదితరులున్నారు.

ఆమదాలవలస : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మహిళలను కించపరిచే విధంగా వ్యవహరిస్తే వైసిపి కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాల మహిళా అధ్యక్షులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గానికి చెందిన పలువురు తెలుగు మహిళలు ఎమ్మెల్యే రవికుమార్‌తో దిగిన ఫోటోలను వక్రీకరించి ఎమ్మెల్యేపై బురద జల్లడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, టిడిపి మహిళా నాయకులు బోయిన సునీత, గుడ్ల రాజ్యలక్ష్మి, పేడాడ మణి, పొందూరు విజయలక్ష్మి, తెలుగు మహిళలతో పాటు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, రాష్ట్ర టిడిపి న్యాయవిభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, కూన రమేష్, దవల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిందితురాలిని ప్రవేశపెట్టిన పోలీసులు

మహిళ అరెస్టు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పట్టుపురంలో ఈనెల 14న లచ్చయ్య ఇంట్లో దొంగతనానికి పాల్పడుతుండగా అదే ఇంటికి చెందిన మహిళను గాయపర్చి స్కూటీపై పరారైన మనుజ మల్లిక అనే మహిళను మంగళవారం పట్టుకుని అరెస్టు చేసినట్లు పాతపట్నం సిఐ వి. రామారావు తెలిపారు. వసుంధర చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా నడసంద్ర గ్రామానికి చెందిన మనుజ మల్లికను పట్టుకొని ఆమె నుంచి దొంగతనానికి ఉపయోగించిన స్కూటీని, మహిళను గాయపరిచిన ఆయుధాన్ని స్వాధీనం పరుచుకున్నట్లు చెప్పారు. ఈయనతో పాటు మెళియాపుట్టి ఎస్ఐ పి.రమేష్ బాబు, సిబ్బంది ఉన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవి నుంచి విముక్తి

ప్రజాశక్తి- పలాస

ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారానే సమాజంలో హెచ్‌ఐవి నుంచి విముక్తి కల్పించగలమని గెస్ట్ టిఐ ప్రోజెక్టు మేనేజర్ నిరంజనరావు అన్నారు. నేషనల్ యూత్ డే సందర్భంగా ఎపిఎస్ఎసిఎస్ ప్రోజెక్టు డైరెక్టర్ అదేశాల మేరకు టిఐ ఎన్‌జిఒ ద్వారా పలాస గెస్ట్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మార్గదర్శకాల మేరకు ఎన్‌సిఎస్‌వైఎం డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజనరావు మాట్లాడుతూ మనిషి, నిగ్రహం, నియమనిష్టలు, క్రమశిక్షణ కలిగి ఉంటే ఏదైనా సాదించవచ్చన్నారు. విద్యార్థి దశలో చాలా అక్రమిత్తంగా ఉండాలని, అప్పుడే నరైన లక్ష్యాలు కోసం తపించగలమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26లోగా ఆన్‌లైన్‌లోగాని, నేరుగాగాని దరఖాస్తులు అందించాలన్నారు. తమ కళాశాలలో కెమిస్ట్రీ, పిజిక్స్, మాథ్స్, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ, ఆక్వాకల్చర్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్ ఎకనామిక్స్, స్పెషల్ తెలుగు కామర్స్ వంటి కోర్సుల్లో ప్రవేశానికి ఆర్హులని తెలిపారు. ఇటర్మీడియట్ తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు డిగ్రీలో ప్రవేశానికి అర్హులన్నారు. ఆసక్తి గల ఆభ్యర్థులు ధరఖాస్తులు చేసుకోవాలని గోవిందమ్మ కోరారు.

పలాస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో 2025-2026 ఏడాది ప్రవేశానికి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. డిగ్రీ కళాశాలలో నిపుణులైన అధ్యావక బృందంతో తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాదిస్తున్నామన్నారు. తమ కళాశాలలో బి.ఎ(హిస్టరీ), బిఎస్‌సి (మాథమెటిక్స్), బిఎస్ సి (జువాలజీ), బికాం (కంప్యూటర్ అప్లికేషన్) వంటి కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత కలిగిన విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం కళాశాలను సంప్రదించాలని ఆమె కోరారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కవిటి: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని పెద్ద కపాసుకుద్దిలో ఆగస్టు 29న విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు రాధాకృష్ణ యువజన సంఘం సభ్యులు తెలిపారు. రాధాకృష్ణ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్విజ్ పోటీల్లో నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. కోచింగ్ సెంటర్లు, ప్రైవేట్ సెంటర్ల విద్యార్థులకు ఈ పోటీలో ప్రవేశం లేదని స్పష్టం చేశారు. అదే విధంగా ఒక పాఠశాల నుంచి ఒక టీం మాత్రమే పాల్గొనే అవకాశం ఉందని సభ్యులు తెలిపారు. ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, పూర్తి వివరాలకు 8008686745 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులపై న్యాయం చేస్తాం

పలాస: అన్నదాత సుఖీభవ పథకంపై గ్రీవెన్స్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదుకు న్యాయం చేస్తామని మండల తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కిక్కిరి ఢిల్లీరావు అన్నారు. బుధవారం బొడ్డపాడు సచివాలయంలో అన్నదాత సుఖీభవ పథకం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రీవెన్స్ ఫిర్యాదుపై అక్టోబర్ 2న ఈ పథకం ద్వారా రైతు అకౌంట్‌లోకి నగదు వచ్చే విధంగా ఎమ్మెల్యే గౌత శిరీష చర్యలు చేపడుతున్నారన్నారు. దీనితో బొడ్డపాడు పంచాయతీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హార్టీ కల్చర్ అసిస్టెంట్ ఝాన్సీ, ప్రజలు పాల్గొన్నారు.

మందుబాబులకు నిలయంగా సబ్‌ట్రెజరీ కార్యాలయం

ఖాళీ మద్యం సీసాలు

కోటబొమ్మాళి: మందుబాబులకు నిలయంగా సబ్ ట్రెజరీ కార్యాలయం తయారైంది. ఈ సబ్‌ట్రెజరీ ఓ మారు మూల ప్రాంతం కావడం, ఎదురుగా వైన్‌షాపు ఉండడంతో మందు బాబులు రాత్రి ఇక్కడే మద్యం సేవిస్తున్నారు. సబ్‌ట్రెజరి కార్యాలయాన్ని బార్‌లా వాడుకుంటున్నారు. ఇటు వైపు పోలీసులు కూడా కన్నెత్తి చూడకపోవడంతో మందుబాబులకు అడ్డూ అదుపులేకుండా పోయింది. కొందరు అసంఘటిత కార్యక్రమాలు కూడా ఇక్కడ నిర్వహిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఇటువైపు ఓ కన్నేసి ఇలా బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

షాపుల వద్ద చెత్త డబ్బాలు పెట్టాలి

కోటబొమ్మాళి: మండలం కొత్తపేట పంచాయతీలో బుధవారం డిప్యూటీ ఎంపిడిఒ జె. అనందరావు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఇంటింటికి, షాపులకు వెళ్లి వారికి చెత్త రోడ్డుపై వేయొద్దని, ప్రతి షాపు ముందు చెత్త డబ్బా ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించారు. తడి చెత్త, పొడి చెత్త వేరేగా చెత్త డబ్బాల్లో వేయాలన్నారు. ఎవరైనా రోడ్డుపైన చెత్త వేస్తే పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

స్వాధీనం చేసుకున్న సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ కవర్లు

ప్లాస్టిక్ షాపులపై దాడి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ దుకాణాలపై మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి ఆధ్వర్యంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సచివాలయ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. బుధవారం పట్టణంలోని పలు షాపుల్లో ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న, నిల్వ ఉంచిన దుకాణాలపై దాడులు నిర్వహించి సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మెట్టక్కివలసలోని జామి కామేశ్వరరావు దుకాణం, వరద వారి క్వార్టర్ ప్రాంతంలోని అందవరపు నాగేశ్వరరావు దుకాణంలో సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ కవర్లు వినియోగంలో ఉన్నట్లు గుర్తించారు. ఆ కవర్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత దుకాణదారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ఇకపై వ్యాపారులు సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ వాడరాదని కమిషనర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి పెద్ద ముప్పుగా మారుతున్నాయన్నారు. ప్రజలు పర్యావరణహితమైన ప్రత్యామ్నాయాలు ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ దాడుల్లో మున్సిపల్, రెవెన్యూ బిల్ కలెక్టర్ డి.రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్‌ను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో తయారైన ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పి. రవికుమార్, ఎస్.అరుణ, బి.శరత్ కుమారి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.ఎ.రాములు మాట్లాడుతూ విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను సక్రమంగా ఉపయోగించుకుని మంచి విజ్ఞానం సంపాదించాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రవికుమార్, బయలాజికల్ సైన్స్ ఫోరం రాష్ట్ర కౌన్సిలర్ గొంటి గిరిధర్, ఉపాధ్యాయులు పి.మోహనరావు, బి.ఎ. శివరాజ్, జి.అప్పారావు, కోట ఈశ్వరరావు, ఎం.ఉమాకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

ఎసెన్షియల్ బయాలజీ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) శ్రీకాకుళంలో జంతుశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ యాళ్ల పోలినాయుడు రాసిన ఎసెన్షియల్ బయాలజీ అనే పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు బుధవారం ఆవిష్కరించారు. పిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఎన్‌సిసి అధికారిగా ఉంటూ జీవవైవిధ్యం పరి రక్షణలో డాక్టరేట్ డిగ్రీ సంపాధించి, తేలినీలాపురం, తేలుకుంచి పక్షి సంరక్షణ కేంద్రాలపై పరిశోధన చేసి, జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధన పత్రాలను ప్రచురిస్తూ జీవ శాస్త్రానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలను పుస్తక రూపంలో రాసినట్లు తెలిపారు. పుస్తక రచయితను అభినందించారు.

ఫ్యాన్లు అందజేస్తున్న గోపాల్

తాళ్లభద్ర హైస్కూల్‌కు ఫ్యాన్లు వితరణ

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల తాళ్లభద్ర హైస్కూల్‌కు గ్రీన్‌ఆర్మీ ఆధ్వర్యంలో సీలింగ్ ఫ్యాన్లు వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనేల గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఆక్సిజన్ మార్కెట్‌లో కొనుక్కోకుండా ఉండాలంటే మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులు జన్మదిన సందర్భంగా నిర్జీవమైన ప్లాస్టిక్ బహుమతులు కంటే స్కూల్‌కు మొక్కలను దానం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గోపికృష్ణ గ్రీన్‌ఆర్మీ కార్యదర్శి బి.తిరుమల, గ్రీన్‌ఆర్మీ సభ్యులు, యువజన నాయకులు నక్క అనిల్ కుమార్, నగిరి లక్ష్మి, ఉపాధ్యాయులు మాధవి లత, విద్యాసాగర్, జయప్రద, లోకనాథం, శ్రీదేవి హేమావతి, సాహితీ విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

పొందూరు: మండలంలోని తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1994-95 పదో తరగతి బ్యాచ్ రూ.35 వేలును ఆర్థికసాయంగా అందజేశారు. ఇందులో ఇటీవల గ్రామానికి చెందిన సహచర పూర్వ విద్యార్థి చింతాడ ధనలక్ష్మి భర్త మృతి చెందడంతో ఆమెకు రూ.10 వేలు, మిగిలిన రూ.25 వేలు మొత్తాన్ని పాఠశాలకు కుర్చీలను, స్వర్ణోత్సవ కళావేదికకు రంగులు వేసేందుకు అందజేశారు. వీరి ఆర్థికసాయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యాన పంటలపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- రణస్థలం

గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఉద్యాన పంటల్లో నీరు నిలిచి తెగుళ్ల సోకే అవకాశం ఉందని మండల ఉద్యానవన శాఖాధికారిణి అమరేశ్వరి అన్నారు. పలు పంటలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

అరటి : నిల్వ నీటిని త్వరగా బయటకు పోయేలా చూడాలని, విరిగిపోయిన చెట్లను రెండు పిలకలు వదిలి కోసివేయాలని, నీటి ముంపులో తోట రెండు రోజులు ఉన్నట్లయితే వీలైనంత త్వరగా నీరు తీసివేసి తోటలను ఆరేలా చేసి చెట్టు ఒక్కింటికి 100గ్రా. యూరియా, 80గ్రా పొటాష్ ఎరువులను వేసుకోవాలని తెలిపారు. ఆకులు, గెలలపై పొటాషియం నైట్రేట్ 5 గ్రా. లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో మూడు నుంచి నాలుగుసార్లు పిచికారి చేయాలన్నారు.

బొప్పాయి : మొక్క మొదళ్ల దగ్గర ఉన్న నీటిని తీసివేసి, మెటాలాక్సిల్ ఎంజెడ్ లేదా సిఒసి 3 గ్రా లీటరు నీటికి కలిపి మొదళ్ళ దగ్గర పోయాలని, తద్వారా వేరు కుళ్ల తెగులును నివారించవచ్చునన్నారు. సూక్ష్మ పోషకాల మిశ్రమం 5గ్రా. లీటరు. నీటికి కలిపి పిచికారి చేయాలని, బూస్టర్ డోసు కింద ఎకరానికి 25కి.గ్రా యూరియా 25 కి.గ్రా. పోటాష్‌ను అందించాలన్నారు.

మామిడి : విరిగిన కొమ్మలను కత్తిరించి పైభాగాన బోర్డ్ పేస్టు లేదా సిఒసిను పూతగా పూయాలని, ఒరిగిన, పడిపోయిన చిన్న చెట్లను లేపి మట్టిని ఎగదోయాలని తెలిపారు. వేర్లను తెగుళ్ల నుంచి కాపాడటానికి కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా.లీటరు చొప్పున మొదళ్ళ వద్ద పోయాలన్నారు.

కూరగాయ పంటలు: వర్షాలు ఆగిన వెంటనే 19 19 19 లేదా 13: 0:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలని, కూరగాయ పంటల్లో బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులునివారణకు కార్బన్డిజం ఏ 10గ్రా. లేదా మ్యాంకోజెబ్ ఏ 25 గ్రా.0 స్ట్రెప్టోమిసైన్ ఏ 2గ్రా. 10 లీ. నీటికి కలిపి పిచికారి చేయాలని స్పష్టం చేశారు. బూజు తెగులు నివారణకు మెటాలాక్సిల్ మ్యాంకోజెబ్ ఏ 2గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని, బూస్టర్ డోసు కింద ఎకరానికి 5 కి.గ్రా. యూరియా 5 కి.గ్రా. పోటాష్‌ను కలిపి వేయాలన్నారు. ఇలా చేస్తే పంటలను కాపాడుకోవచ్చున్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- నరసన్నపేట

ఈ నెల 22న శుక్రవారం ఉర్లాం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోగల 11 కెవి చోడవరం ఫీడర్‌పై రిపేరు పనులు నిమిత్తం కొత్తలైన్లు వేయుటకు నడగాం నుంచి సుందరాపురం వరకు, నడగాం నుంచి చోడవరం వరకు, నడగాము నుంచి వెంకటాపురం వరకు అన్ని గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎఇ నరసింహ కుమార్ తెలిపారు. గ్రామాల్లో వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆమదాలవలస : 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కె.వి మెట్టక్కివలస ఫీడర్‌పై చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపట్టనున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 22న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పట్టణంలోని మెట్టక్కివలస, అమ్మనగర్, ఊసవానిపేట, రెడ్డిపేట, గేదెలవానిపేట, కసింవలస, అలమాజీపేట పంప్ హౌస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

పలాస: మండలం రామకృష్ణాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ జి. యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో పురుషోత్తపురం, రాజాం కాలనీ, తారకరామ్ కాలనీ, మొగిలిపాడు, దత్తాశ్రమం, శాసనం, తహశీల్దార్ కార్యాలయం, పలాస జూనియర్ కళాశాల, శ్రీరామ్‌నగర్, వాసుదేవపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు.

మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న ఎఒ దానకర్ణుడు

పంట నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పద్మ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం ఎఒ దానకర్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేసి రైతులకు వరి పంటలో తీసుకోవాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరించారు. అలాగే రసాయనిక ఎరువులు మోతాదుకు మించి వాడరాదని రైతులకు సూచించారు. సెప్టెంబర్ 15లోగా ప్రతి రైతు పంట నమోదు, ఇకెవైసి పూర్తి చేసుకోవాలని తెలియజేశారు. పంట నమోదు చేసుకున్న రైతులందరికీ విధిగా ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర మజ్జి, కూటమి నాయకులు జగబంధు మజ్జి, రాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రేమ్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

బూర్జ: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఎడి రాజగోపాల్ అన్నారు. బుధవారం మండలంలోని డొంకలపర్తలో నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఎఒ డి.ఉషారాణి, వ్యవసాయ సహాయకులు బి.లావణ్య, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జడ్డు కృష్ణ, నీటి సంఘం అధ్యక్షుడు స్వామి నాయుడు, బెజ్జిపురం తోటం నాయుడు, జడ్డు చిన్నం నాయుడుతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గ్రామ దేవత అమ్మవారి ఆలయంలో శ్రీ స్వేచ్ఛావతి మంత్రాన్ని స్థానిక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కళాబృందం శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ అధ్యక్షులు బృందం జయలక్ష్మి పట్నాయక్, బలివాడ భవాని, అనపణికుమారి, బల్లెడ శరణ్య, బల్లెడ శ్రీదీక్షిత, లక్కోజు జీవిత స్వరంతో శ్రావ్యంగా ఆలపించిన మంత్రాన్ని ఆగమపండితులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్య స్వామి, స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సమక్షంలో ఆవిష్కరించారు. అష్టలక్ష్మి వ్రత పూజల్లో శ్రీ వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నాట్య గురువులు బలివాడ శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో డాన్స్ టీచర్స్ దట్టి కావ్య, నీలాపు శైలు, సిల్లా పూజ, చాట్ల జయలక్ష్మి, ఆసిపు శ్వేతారాణి, యు. పల్లవి, ఎ.దీపిక, పి. జైత్రీకాధ్యాయని అష్టలక్ష్ములుగా తయారై అష్టలక్ష్మి స్తోత్రాన్ని నాట్యం చేసి భక్తులను అలరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చిన్నారులను సత్కరించారు.

నృత్యం చేస్తున్న బృందం సభ్యులు

వరి నాట్లు వేస్తున్న కూలీలు

జోరందుకున్న వరి నాట్లు

ప్రజాశక్తి- రణస్థలం

సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వరినాట్లు పనులు చేసుకునేందుకు వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు దిగాలు చెందడం విధితమే. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో పొలాల్లో వరినాట్లు పనులు ఊపందుకున్నాయి. రణస్థలం మండలంలో కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో భాగంగా రైతులు తమ పొలాల్లో దమ్ము పట్టి, వరినాట్లు ముమ్మరంగా చేపడుతున్నారు. ఏ గ్రామంలో చూసిన మహిళలు చల్లని వాతావరణంలో చక్కని పైరు పాటలు పాడుకుంటూ ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా వరినాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులందరూ ఒకేసారి ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన నేపథ్యంలో వ్యవసాయ కూలీల కొరత రైతులను వెంటాడుతోంది. వ్యవసాయ పనులు ఒకేసారి ముమ్మరం కావడంతో మండలంలో ఎకరా పొలంలో వరినాట్లు నాటాలంటే కూలీలకు రైతులు రూ.6 వేలు పైమాటే చెల్లించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పరిస్థితి అలా ఉంటే ఏడాదికోసారి వచ్చిన వరినాట్లు పనుల్లో ఆ మాత్రం సంపాదించుకోకపోతే ఎలా మరి అని ప్రశ్నిస్తున్నారు మహిళా కూలీలు. ఏదిఏమైనప్పటికీ మహిళా వ్యవసాయ కూలీలకు వరినాట్ల పనుల్లో బిజీబిజీగా ఉన్నారు.

జాతీయస్థాయిలో మెరిసిన సిద్ధార్థ్

ప్రజాశక్తి- కవిటి

మండలం ముత్యాలపేట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి బెందాళం సిద్ధార్థ్ తన కలాన్ని ఆయుధంగా మార్చుకొని 'మొక్కవోని దీక్ష' అనే కథతో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచాడు. ఖమ్మం వురిమళ్ల ఫౌండేషన్ నిర్వహించిన బడిపిల్లల కథల పోటీకి దేశం నలుమూలల నుంచి వందలాది కథలు వచ్చాయి. వాటిలో సిద్ధార్థ్ కథ విజేతగా నిలిచినట్టు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సిద్ధార్థను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎంఇఒ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ గ్రామీణ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటగలరని సిద్ధార్థ్ మరోసారి నిరూపించాడని కొనియాడారు. ఇలాంటి విజయాలు ఇతరులకు స్ఫూర్తి కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చిత్రీ ఈశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్, ఉప సర్పంచ్ పాతిన చంద్రశేఖరం, విద్యా కమిటీ చైర్మన్ ఆర్ చిరంజీవమ్మ, ఉపాధ్యక్షుడు బడే మాధవరావు, గ్రామపెద్దలు సత్యనారాయణ, పి వెంకటరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ్‌ను సత్కరిస్తున్న పెద్దలు

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలం ఈదుపురం శ్రీ రామాలయ ప్రాంగణ ఆవరణలో శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆవిర్భావం, ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా జానపద సంబరాలు 24 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు రంగాల జానకిరామ్ రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనంజయ రెడ్డి, ఉపాధ్యక్షులు నార్తు గంగయ్య మాస్టర్, ప్రచార కార్యదర్శి చలరాయి వినోద్ కుమార్, ఉప కార్యదర్శి కారింగి తులసయ్య మాస్టర్, కోశాధికారి కొప్పల హేమంత్, ఉప కోశాధికారి కారింగి త్రినాథ్‌రెడ్డి ప్రధాన సలహాదారులు తిప్పన దాలయ రెడ్డి, సలహాదారులు బొరా రామారావు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద బుధవారం రాత్రి బారువ ఎస్ఐ హరిబాబు ఆధ్వర్యంలో మహిళలకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శక్తి యాప్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వేధింపులకు గురైన సమయాల్లోనూ ఈ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి- నరసన్నపేట

రైతులు ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయం ఆచరించి అధిక దిగుబడులు సాధించాలని సిపిఎం ధనుంజయ సూచించారు. బుధవారం నరసన్నపేట రైతుసేవా కేంద్రం వద్ద సారవకోట, జలుమూరు, పోలాకి, నరసన్నపేట మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రకతి వ్యవసాయ జిల్లా అడిషనల్ డిపిఎం ధనుంజయ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ట్రైనింగ్ ఎస్ఎఫ్ఎ గోవింద్ రెడ్డి, శివాజీ, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ తోట రమణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని ఉదారత

ప్రజాశక్తి- కవిటి

ముత్యాల పేట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు పి.వెంకటరమణ తన ఉదారత చాటుకున్నారు. పాఠశాలలో చదువుతున్న సుమారు 50 మంది విద్యార్థులకు 50 స్టీల్‌ప్లేట్లు మధ్యాహ్న భోజనం చేసేందుకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యూనిఫామ్ మాదిరిగానే విద్యార్థులందరికీ ఒకే రకమైన భోజనం ప్లేట్లు ఉండాలని ఉద్దేశంతో పిల్లలకి ప్లేట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శివ, హారిక, నాగమణి, విద్యాకమిటీ చైర్మన్ రాజేష్, పి. వెంకటరావు, పి.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలో నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎఒ సూర్యకుమారి తెలిపారు. బుధవారం మండలంలో చిక్కాలవలస, మామిడివలస, సుందరాపురం గ్రామాల్లో నీటి మునిగిన పొలాలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. వరదలు ఎక్కువగా ఉన్నందున చిక్కాలవలసలో 50 ఎకరాలు, మామిడివలస 120 ఎకరాలు, సుందరాపురంలో 50 ఎకరాలు ముంపు జరిగినట్లు తెలిపారు. వరద తగ్గిన తర్వాత పరిశీలించి నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముంజి శ్రీరాములు పాల్గొన్నారు. అనంతరం మాకివలస గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసరావు

విద్యార్థులు ఒక ప్రణాళిక ప్రకారం చదివితే మంచి విషయాలు సాధిస్తారని సిఐ ఎం.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ప్రియాగ్రహారం జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన చేసుకోవాలని తెలిపారు. సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలాకి ఎస్ఐ జి.రంజిత్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయి జగదీష్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

యోగా పోటీలకు సాయి జగదీష్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జ్ఞాన భారతి విద్యా సంస్థలకు చెందిన విద్యార్థి సాయి జగదీష్ యోగాపోటీల్లో జిల్లా స్థాయిలో ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమని విద్యా సంస్థల కార్యదర్శి జోహర్ ఖాన్ అభినందించారు. నరసన్నపేటలో ఇటీవల జరిగిన నేషనల్ యోగ స్కూల్ ఫెడరేషన్ జిల్లాస్థాయి పోటీల్లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన పాలేపు సాయి జగదీష్ అండర్ 14 యోగ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించి, రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. తాడేపల్లిగూడెంలో ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే రాష్ట్ర స్థాయి యోగ పోటిలకు వెళ్తున్న సందర్భంగా జ్ఞానభారతి ఎడ్యుకేషన్ ట్రస్ట్ సిఇఒ జోహార్ ఖాన్ విద్యార్థి సాయి జగదీష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐబి పండా, హెచ్ఎం రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, వ్యాయమ ఉపాధ్యాయులు కైలాష్ కుమార్, రాము, సయ్యదా సుల్తానా, అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

సచివాలయం సందర్శన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని మాకవరం సచివాలయాన్ని బుధవారం ఎంపిడిఒ నీరజ సందర్శించారు. అక్కడ ఉన్న హాజరు పట్టి, రికార్డులను పరిశీలించారు. వరద ముంపునకు ఉగురైన ప్రాంతాల్లో తాగునీటి సమస్యపై శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలన్నారు. పారిశుధ్యంపై దృష్టి సారించాలని సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం వంశధార నదిని పరిశీలించారు. అలాగే వరద ముంపునకు గురైన రెల్లివీధికి చేరుకొని ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య సిబ్బందిని తగు సూచనలు, సలహాలు అందించారు. ఈమె వెంట సూపర్‌వైజర్ బుచ్చిబాబు, ఉదయ్ కుమార్, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శాంతి

ప్రజలను మోసగించిన ప్రభుత్వం

కొత్తూరు: కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగించిన ప్రభుత్వమని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని గొట్టిపల్లి పంచాయతీ భూతాలగూడ గ్రామ సమీపంలో పంట పొలాల్లో ఉన్న గిరిజనులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల మోసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి వి.లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు ఉన్నారు.

ఒత్తిడిని జయిస్తే విజయం

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ చాలా కీలకమైనదని ఆ దశలో ఒత్తిడిని జయిస్తేనే విజయం సాదించగలరని ప్రముఖ వైద్యులు హెచ్.రాజకుమార్ అన్నారు. కాశీబుగ్గ శ్రీ విద్యావాహిని ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన స్వాగతోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒత్తిడి, కదలిక, ఆహార నియమాలు పాటించడంతో పాటు తగినంత విశ్రాంతి తీసుకొని ఆరోగ్య సూత్రాలు పాటించిన నాడే చదువులో రాణించి విద్యార్థులు సాధించాలనే లక్ష్యాలను చేరుకోగలరన్నారు. గతేడాది పబ్లిక్ పరీక్షల్లో అత్యతిక మార్కులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాడెంట్ పైల తిరుమలరావు, డైరెక్టర్లు మన్మధ రావు, సంధ్యారాణి, వైస్ ప్రిన్సిపాల్ ఖగేశ్వర రావు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ

లావేరు: మండల కేంద్రం లావేరులోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఎచ్చెర్ల గొల్ల ఇటీవల పొలంలో గుండెపోటుతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, టిడిపి నాయకులు బుధవారం పరామర్శించారు. గొల్ల ఆకస్మిక మృతికి సంతాపాన్ని తెలిపి నివాళ్లర్పించారు. అనంతరం లంకలపల్లి శ్రీనివాసరావు సౌజన్యంతో రూ.మూడు వేలు, బియ్యాన్ని సురేష్ అందజేశారు. ఈయనతో ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, మాజీ జెడ్‌పిటిసి ఎన్.త్రినాధరావు, మాజీ సర్పంచ్ ఎం.శంకరరావు, లంకలపల్లి ఆనంద్, గండి సురేష్, కరిమేరకల అనిల్ తదితరులున్నారు.